ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 41
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
మంగళవారం, 22-08-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me



# పార్టీకి వ్యతిరేకంగా పోతే
# పీకి అవతల పడేస్తాం

తెలంగాణ ఎన్నికలు సమీపిస్తుండటంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. బీఆర్ఎస్ మేనిఫెస్టోను అక్టోబర్ 16న వరంగల్ నిర్వహించే సింహగర్జన సభలో విడుదల చేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 95 నుంచి 105 స్థానాల్లో గెలుస్తామని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని సహించమని కేసీఆర్ తేల్చిచెప్పారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పోయినా వాళ్లు ఎంత పెద్దవాళ్లైన పార్టీ నుంచి బయటకు పంపుతామన్నారు. క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పీకి అవతల పడేస్తామన్నారు.

## బీఆర్ఎస్ ఒక సముద్రం, ప్రతి ఒక్కరికీ అవకాశాలుంటాయ్

టికెట్లు రానంత మాత్రాన చిన్నబుచ్చుకోవాల్సిన అవసరం లేదని సీఎం కేసీఆర్ తెలిపారు. అనవసర హడావుడి పడి రాజకీయ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కేసీఆర్ పార్టీ నేతలకు హితవు పలికారు. బీఆర్ఎస్ ఒక సముద్రం అని, ప్రతి ఒక్కరికీ అవకాశాలుంటాయన్నారు. టికెట్లు రాని వాళ్లు పార్టీలోనే ఉండాలని కోరారు. రాజకీయ జీవితమంటే ఎమ్మెల్యేగా పని చేయడమే కాదన్న కేసీఆర్... ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీ ఇలా అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఇతర అవకాశాలు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ విజయం సాధించి తెలంగాణను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని సీఎం కేసీఆర్ తెలిపారు.

## అక్టోబర్ 16న బీఆర్ఎస్ మేనిఫెస్టో

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 95 నుంచి 105 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో మొత్తం 29 స్థానాల్లో బీఆర్ఎస్, మజ్లిస్ విజయం సాధిస్తుందన్నారు. ఎమ్మెల్యేలు మాత్రమే కాకుండా మొత్తం 17 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ జయకేతనం ఎగురువేస్తుందన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య స్నేహం ఉందని, భవిష్యత్‌లోనూ ఇది కొనసాగుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు. అక్టోబరు 16న వరంగల్‌లో సింహగర్జన సభ నిర్వహించి, మేనిఫెస్టోను ప్రకటిస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చామని, పోటీ చేయడం, చేయకపోవడం ఆయన ఇష్టమని సీఎం కేసీఆర్ తెలిపారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడాలా? వద్దా? అన్నది ఆయనే తేల్చుకోవాలన్నారు.

## అభ్యర్థుల జాబితాలో 7గురు మహిళలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితాలో 7గురు మహిళలకు సీఎం కేసీఆర్ చోటు కల్పించింది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను 115 స్థానాలకు సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఇందులో ఏడుగురు మహిళలు ఉన్నారు. 2018లో నలుగురు మహిళా అభ్యర్థులకు టికెట్లు ఇవ్వగా వారిలో ముగ్గురు గెలిచారు. ఈసారి అదనంగా మరో ముగ్గురు మహిళలకు జాబితాలో స్థానం కల్పించారు.

## కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు అచంచల విశ్వాసం- ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను సీఎం కేసీఆర్ విడుదల చేశారు. తెలంగాణకు ఉత్సాహకరమైన సమయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ట్వీట్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసిఆర్ 119 స్థానాలకు గాను 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారని తెలిపారు. సీఎం కేసీఆర్ ధైర్యవంతమైన నాయకత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందన్నారు.



## హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీకి మూలస్తంభం
### మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్



## బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాలో తనిఖీ చేయాలన్న పురంధేశ్వరి

**జయభేరి, విజయవాడ :**

రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ప్రతి నియోజక వర్గంలో బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాలను తనిఖీ చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి మిగతా 2 లో

## ఫ్రెండ్ కూతురిపై అత్యాచారం
### సహకరించిన భార్య
### నిందితుడు ఓ ఉన్నతాధికారి



**మైనర్ అయిన స్నేహితుడి కూతురుపైననే అత్యాచారం చేశాడో ఢిల్లీ ప్రభుత్వంలోని మహిళ, శిశు సంక్షేమ శాఖలో డెప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉన్న ఒక రాక్షసుడు. ఈ దారుణంలో ఆ దుర్మార్గుడికి అతడి భార్య కూడా సహకరించింది. మానవత్వానికే చెరగని మచ్చ వంటి ఈ ఘటన ఢిల్లీలో జరిగింది. ప్రస్తుతం ఈ ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నారు.**

2020లో తన స్నేహితుడు చనిపోవడంతో అతడి 16 ఏళ్ల కూతురిని తన ఇంటికి తీసుకువచ్చాడు ఆ అధికారి. ఆ తరువాత ఆ బాలికను బెదిరించి, ఆమెపై 2020 అక్టోబర్ నుంచి 2021 ఫిబ్రవరి వరకు పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆ రాక్షసుడి కారణంగా ఆ బాలిక గర్భం దాల్చింది. ఆ గర్భం పోవడానికి అతడి భార్య ఆ బాలికకు అబార్షన్ పిల్స్ ఇచ్చింది. తనకంటూ ఎవరూ లేని ఆ బాలిక ఈ దుర్మార్గాన్ని భరించలేక, ఎవరికీ చెప్పుకోలేక డిప్రెషన్ లోకి వెళ్లింది. యాంగ్జైటీ అటాక్స్ తో బాధపడసాగింది. దాంతో, తప్పనిసరై ఆ బాలికను ఢిల్లీలోని ఒక హాస్పిటల్ లోని సైకియాట్రిస్ట్ వద్దకు తీసుకువెళ్లారు. కౌన్సెలింగ్ చేస్తున్న సమయంలో ఆ బాలిక తనపై జరిగిన దారుణాన్ని ఆ డాక్టర్ కు వివరించింది. దాంతో ఆ సైకియాట్రిస్ట్ వెంటనే.. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఢిల్లీ ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా ఉన్న ఆ నిందితుడు పోలీసులపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకువచ్చాడు. అయితే, ఈ ఘటనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో, పోలీసులు సోమవారం ఆ వ్యక్తిని, అతడికి సహకరించిన అతడి భార్యను అదుపులోకి మిగతా 2 లో



## లక్ష మెజారిటీ తో గులాబీ జెండా ఎగరవేస్తా

టికెట్ కేటాయించిన బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్ రావు కృతజ్ఞతలు. బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. 3 లో



**శ్రీ గోదా సామెత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం**

కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలోని శ్రీ గోదా సామెత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన కళ్యాణోత్సవంలో కుటుంబ సామెతంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం... ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

jayabheridaily.com
ప్రభాత
జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్ :**

మంత్రి హరీశ్ రావుపై ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఖండించారు. తన కుటుంబ సభ్యుడికి టికెట్ నిరాకరించిన కారణంగా మైనంపల్లి హన్మంతరావు మంత్రి హరీశ్ రావుపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు. పార్టీ ప్రారంభం నుంచి హరీశ్ రావు ఒక సమగ్ర వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్నారన్నారు. పార్టీకి ఒక మూలస్తంభంగా కొనసాగుతున్న హరీశ్ రావుకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థులందరికీ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. తనకు మళ్లీ సిరిసిల్ల నియోజకవర్గం టికెట్ కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా జీవితంలో నిరాశ, నిస్పృహాలు తప్పవని, సామర్థ్యం ఉన్న కొంత మంది నాయకులకు దురదృష్టవశాత్తూ టికెట్లు లభించలేదన్నారు. ఉదాహరణకు క్రిశాంక్‌తో పాటు అలాంటి కొంత మంది నేతలకు అవకాశం రాలేదన్నారు. వీరికి మరో రూపంలో ప్రజలకు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ కూడా స్పందించారు. మైనంపల్లికి టికెట్ ఇచ్చామని, పోటీ చేయడం, చేయకపోవడం ఆయన ఇష్టమని తెలిపారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడాలా? వద్దా? అన్నది ఆయనే తేల్చుకోవాలన్నారు. టికెట్లు రానంత మాత్రాన చిన్నబుచ్చుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. అనవసర హడావుడి పడి రాజకీయ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కేసీఆర్ పార్టీ నేతలకు హితవు పలికారు. మంత్రి హరీశ్ రావుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సోమవారం తీవ్ర విమర్శలు చేశారు. మల్కాజిగిరిలో తాను, మెదక్‌లో తన కుమారుడు ఇద్దరం పోటీ చేస్తామన్నారు. మెదక్‌లో హరీశ్ రావు పెత్తనం ఏందని మండిపడ్డారు. మెదక్ అభివృద్ధి కాకపోవడానికి మంత్రి హరీశ్ రావు కారణమని ఆరోపించారు. మెదక్‌లో హరీశ్ రావు కల్పించుకుంటే తాను సిద్దిపేటలో కల్పించుకోవాల్సి ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఘాటుగా వ్యాఖ్యానించారు. అవసరమైతే సిద్దిపేటలో తన తడాఖా చూపిస్తానన్నారు. హరీశ్ రావు అడ్రస్ గల్లంతు చేస్తానని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్ కుటుంబంలో చాలామందికి టికెట్ ఇచ్చారన్నారు. తనకు, తన కుమారుడికి టికెట్ ఇస్తేనే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. టికెట్లు రాకపోతే స్వతంత్రులుగా పోటీ చేస్తామని ప్రకటించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మల్కాజ్‌గిరి నుంచి తాను, మెదక్ నుంచి తన కుమారుడు రోహిత్ పోటీ చేస్తారని మైనంపల్లి పేర్కొన్నారు.

## తనిఖీ చేయాలన్న పురంధేశ్వరి

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో పేర్ల విషయంలో ఆందోళన ప్రతి రోజు కొనసాగుతోందన్నారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు ప్రధానమైన ఆయుధమని దానిని దుర్వినియోగం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రజలు తాము కోరుకునే పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఓటు ప్రధాన ఆయుధమని, దానిని కూడా దుర్వినియోగం చేసేలా కొన్ని పార్టీలు వ్యవహరిస్తున్నాయన్నారు. సామాన్య ప్రజల చేతిలో పదునైన ఆయుధం ఓటని పురంధేశ్వరి చెప్పారు. అర్హులైన వారందరిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీలు ఓటర్ల జాబితాలను ట్యాంపర్ చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తమకు అనుకూలం అయిన వారిని మాత్రమే జాబితాలో ఉంచడం, అనుకూలంగా లేని వారిని తొలగించడం వంటి చేస్తున్నారని మండిపడ్డారు.ఓట్ల తొలగింపు అంశం రాష్ట్ర వ్యాప్తంగా వికృతరూపం సంతరించుకుందన్నారు. విశాఖలో ఓ నియోజక వర్గంలో 271 బూత్‌లు ఉంటే అక్కడ 2.61లక్షల ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఉన్న ఓట్లలో 70వేల ఓట్లలో అర్హులు కాని వారున్నారని చెప్పారు. ఉరవకొండలో అర్హులైన ఓట్ల తొలగింపులో ఇద్దరు అధికారుల్ని తొలగించారని, జడ్పీ సీఈఓలుగా పనిచేసిన భాస్కర్ రెడ్డి, స్వరూపరాణిలపై ఈసీ చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా జరిగి ఉంటుందని, జిల్లా స్థాయి, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు ఓటర్ల జాబితాలు తనిఖీ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు ఫార్మ్ 6, ఫార్మ్ 7, ఫార్మ్ 8ల ద్వారా కొత్త వారిని చేర్చడం, లేని వారిని తొలగించడం, సవరణలు చేపట్టడం వంటి విషయాలపై కార్యక్రమాలను చేపడతామన్నారు. వాలంటీర్ల ద్వారా సమాచారాన్ని సేకరించి ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు అధికార పార్టీ పాల్పడుతోందని ఆరోపించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎలా ముందుకు వెళ్ళాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు. విజయవాడలో నిర్వహించిన పార్టీ సమావేశానికి బండి సంజయ్ కుమార్ హాజరు కావాల్సి ఉన్నా చివరి నిమిషంలో పర్యటన రద్దైంది. విమానం ఆలస్యం కావడంతో భేటీలో వర్చువల్‌గా పాల్గొనాలని నిర్ణయించుకున్నారు.

## ఫ్రెండ్ కూతురిపై అత్యాచారం

తీసుకున్నారు. ఆ అధికారిని సస్పెండ్ చేస్తున్నట్లు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారంపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ ని సీఎం ఆదేశించారు. ఈ ఘటనను మానవత్వానికి మచ్చగా ఢిల్లీ మంత్రి సౌరబ్ భరద్వాజ్ అభివర్ణించారు. ఆ బాలికకు న్యాయం చేస్తామని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన తరువాత కూడా కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేయడంలో ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నిస్తూ ఢిల్లీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్వాతి మలీవల్ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం నిందితులపై పోక్సో సహా పలు ఇతర చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు.

## మంత్రి కాన్వాయ్‌కు అడ్డంగా పశువులతో నిరసన



**జయభేరి, ఉత్తరప్రదేశ్ :**

గ్రామస్తులు తమ సమస్యను చెప్పుకునేందుకు మంత్రి కాన్వాయ్‌కు పశువులను అడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన సుమారు 90 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి ధరంపాల్ సింగ్ గురువారం తన నియోజకవర్గమైన అవోన్లాలోని గుర్గావ్ ప్రాంతంలో సుమారు రూ.9 కోట్లతో నిర్మించనున్న పశు వైద్యశాల భూమిపూజ కోసం వెళ్లారు. గ్రామంలోని వీధుల్లో సంచరించే పశువుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. రోడ్డుపై పశువులను ఉంచి మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో తగిన స్థలాన్ని గుర్తించి గోశాల ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి ధరంపాల్ సింగ్ కాన్వాయ్‌ను గ్రామస్తులు పశువులతో అడ్డుకోవడంపై పశు వైద్యాధికారి సంజయ్ కుమార్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని 90 మందిపై ఆదివారం కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ మంత్రిపై మండిపడుతున్నారు.

# తిరుమలలో కంచె వేయటం అసాధ్యమా..

**జయభేరి, తిరుమల, ఆగస్టు 21 :**

తిరుమల నడక దారిలో చిన్నారి లక్షితపై చిరుతపులి దాడి తర్వాత టీటీడీకి ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రధాన డిమాండ్స్ లో ఒకటి అలిపిరి, శ్రీవారి మెట్ల నడక మార్గంలో కంచెను ఏర్పాటు చేయొచ్చు కదా.. ఎందుకు వేయట్లేదని భక్తులు, నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల హుండీ ఆదాయం వచ్చే తిరుమల వెంకన్న నిధుల కొరతలేంటని మరికొందరి ప్రశ్న. ఇదే విషయమై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కూడా గతంలో కొన్ని సార్లు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. వాస్తవానికి తిరుమల నడకమార్గంలో కంచె ఏర్పాటు విషయంలో అవరోధంగా మారుతున్న ప్రధాన అడ్డంకులు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.కేంద్ర ప్రభుత్వం తిరుమల కొండలు ఉన్న శేషాచలం అటవీ ప్రాంతాన్ని దేశంలోనే మూడో అతిపెద్ద బయోస్పియర్ రిజర్వ్ గా గుర్తించింది. అంటే ఇక్కడ ఉండే అడవుల్లో చాలా రకాలైన జీవజాతులు ఉంటాయి. వాటిలో చాలా వరకూ అంతరించిపోయే దశకు వచ్చేసినవి ఉన్నాయి కనుక వాటిని కాపాడాలనే ఉద్దేశంతో శేషాచలం అటవీ ప్రాంతం విస్తరించి ఉన్న 8వేల కిలోమీటర్ల ప్రాంతాన్ని బయోస్పియర్ రిజర్వ్ చేసింది. ఈ ప్రాంతానికి లీగల్ ప్రొటక్షన్ ఉంటుంది. ఏ చిన్న అభివృద్ధి పని చేయాలన్నా చాలా పై స్థాయిలో పర్మిషన్ ఉండాలి. తిరుపతి, రాజంపేట ఫారెస్ట్ డివిజన్స్ తో పాటు తిరుపతి లో ఎస్వీ జూ పార్క్ కూడా ఈ పరిధిలోకి వస్తుంది. కనుక ఇక్కడ బతికే జీవజాతులకు ఆటంకంగా మారే ఏ పనినీ చేపట్టడం అంత సులభం కాదు.అడవుల్లో జీవించే వన్యప్రాణుల స్వేచ్ఛ కోసం, వాటి జీవనం కోసం మన రాజ్యాంగంలో కొన్ని చట్టాలు ఉన్నాయి. 1972లో రూపొందించిన వన్యప్రాణుల సంరక్షణ చట్టం అలాంటిదే. రాజ్యాంగంలో 48ఏ చెప్పేది ఏంటంటే.. రిజర్వు ఫారెస్ట్ లలో వన్యప్రాణుల కదలికలను అడ్డుకోవటం కానీ వాటికి హాని తలపెట్టే విధంగా చర్యలు చేపట్టటం కానీ నేరంగా పరిగణిస్తారు. ఇప్పుడు తిరుమల నడకమార్గంలో కంచెలు ఏర్పాటు చేస్తే అది వన్యప్రాణుల స్వేచ్ఛను హరించటమే. మనకు ఎలా అయితే ఈ సమాజంలో స్వేచ్ఛగా బతికే హక్కు ఉందో అలాగే అడవిలో వన్యప్రాణులకు అన్నమాట. చాలా మంది ఆలోచించని విషయం ఏంటంటే చిరుతల్లాంటి ప్రాణులు చాలా ఎత్తులు కూడా ఎక్కగలవు. 20, 30 అడుగుల చెట్టు పైకి ఎక్కి కొమ్మలపై చిరుత హాయిగా నిద్రపోతుంది. అలాంటిది ఐదు, పది అడుగుల ఎత్తైన కంచెలు చిరుతల్లాంటి జంతువులను ఏ మాత్రం ఆపలేవు. ఒకవేళ కంచె వేసినా అది దూకి కంచెలోపలకి పొరపాటున వస్తే... అప్పుడు ఇంకా పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంటుంది. ప్రాణభయంతో జనాల తొక్కిసలాట, అదే ప్రాణభయంతో ఆ క్రూరమృగం మనుషులపై దాడి చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఊహించలేం. కనుక కంచె వేయడం, గోడలు లాంటివి నిర్మిస్తే అందులో దూరిన చిరుతపులి లాంటి వన్యప్రాణాలు బయటకు వెంటనే వెళ్లగలిగే అవకాశం ఉండదు కనుక అది మరింత ప్రమాదకరం.మరికొంత మంది చెబుతున్న విషయం చిరుతలు, పులుల వంటి వాటిని బోన్లు పెట్టి పట్టి జూలలో బంధించొచ్చు కదా. అది కూడా కరెక్ట్ కాదు. పులి, చిరుత, సింహం, ఏనుగు ఏ జంతువైనా అది బతికే వాతావరణానికి అలవాటు పడిపోయి ఉంటుంది. కనుక ఆ ప్రాంతం నుంచి మార్చినా..బోనులో పెట్టినా అది బెంగపడి చనిపోవచ్చు



కూడా. సైకలాజికల్ గా చాలా సెన్సిటివ్ గా ఉంటాయి వన్యప్రాణలు.ఇవన్నీ సరే మనిషిగా మన ప్రాణం మరింత విలువైంది కదా అని సందేహం రావచ్చు. నిజమే. అందుకే తగిన జాగ్రత్తలు పాటించాలి. తిరుమల లాంటి ఆలయాలకు రాత్రి వేళల్లో నడిచి వెళ్లేప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఒక్కరే కాకుండా గుంపులుగా వెళ్లటం వలన క్రూరమృగాలు దగ్గరికి రావు. తమకు అపాయం ఉందన్నా, లేదా తమ శక్తి కంటే ఎక్కువ శక్తి ఉన్న జంతువులు, మనుషులు కనిపించినా పులి, చిరుత లాంటివి దాడులకు దిగవు. జంతువులకు ఆహారం పెట్టడం కూడా సరికాదు. వాటంతటం అవే ఆహారాన్ని సమకూర్చుకోగలవు. మనం ప్రేమతో పెడుతున్నాం అనుకున్నా వాటికి సొంతంగా ఆహారాన్ని సంపాదించుకునే శక్తిని దూరం చేస్తున్నామని గుర్తుపెట్టుకోవాలి. చివరగా ఆహారపదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయటం వలన వాటిని తినేందుకు కుక్కలు, నక్కలు లాంటి జంతువులు వస్తే.. వాటిని తినేందుకు పులులు, చిరుతలు లాంటివి వస్తాయి కనుక అలాంటి విషయాల్లోనూ జాగ్రత్తగా ఉండటం చాలా చాలా అవసరం అని టీటీడీ అధికారులు సూచించారు.

## ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్‌దే



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండొంతుల స్థానాల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఓడిపోతానని సీఎం కేసీఆర్ బలంగా నమ్ముతున్నారని, అందుకే కామారెడ్డికి పారిపోయి పోటీ చేస్తున్నారని విమర్శించారు. కానీ, రెండు నియోజకవర్గాల్లోనూ ఆయన ఓడిపోబోతున్నారని జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మైనార్టీ డిక్లరేషన్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ గజ్వేల్ నుంచి పారిపోతున్నారని నేను గతంలోనే చెప్పానని, మైనార్టీ నేత షబ్బీర్ అలీ చేతిలో ఆయన ఓటమి పాలవ్వడం ఖాయమని అన్నారు. బిఆర్ఎస్ జాబితా చూశాక వచ్చే ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్‌దేనని తేలిపోయింది. గజ్వేల్‌లో గెలుపుపై నమ్మకం లేకనే కేసీఆర్ కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారు. ఆయన స్వరంలో ఓటమి భయం స్పష్టంగా కనిపించింది. కామారెడ్డి గడ్డపై పుట్టిన వ్యక్తిని నేను. ఆ నియోజకవర్గ ప్రజలపై నాకు విశ్వాసం ఉంది. కేసీఆర్‌ను అక్కడి ప్రజలు ఓడిస్తారు. ముస్లిం, మైనార్టీ లీడర్ అని చూసి అక్కడ పోటీ చెయ్యాలని చూస్తున్నారు. కేసీఆర్ ఎక్కడా గెలవరు. ఆయన్ని ఇంటికి పంపడం ఖాయం. కామారెడ్డి అభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదని రేవంత్ అన్నారు.
మైనారిటీ డిక్లరేషన్ కమిటీకి చైర్మన్‌గా తనను ఎంపిక చేశారని, ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులతో ఇవాళ డిక్లరేషన్‌పై చర్చించామని రేవంత్‌రెడ్డి మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 4శాతం మైనార్టీ రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తే..దానిని 12 శాతం చేస్తానని చెప్పిన కేసీఆర్ కేవలం మాటలతోనే సరిపెట్టేశారని విమర్శించారు. కనీసం మైనార్టీ విభాగాన్ని కూడా బలోపేతం చెయ్యలేదు. అధికారులు లేమితో ఆ విభాగం నిర్వీర్యమవుతోంది. ముస్లిం డెవలప్‌మెంట్, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం ఏం చెయ్యాలన్నదానిపై చర్చించాం. కమిటీలో కొన్ని వినతిపత్రాలు వచ్చాయి. వాటిపై మరోసారి చర్చిస్తామని రేవంత్ అన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీలు కూడా హాజరయ్యారు.



## లెఫ్ట్ పార్టీల పొత్తు ముచ్చటే లేదు


**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలతో పొత్తు ఉండదని తేలిపోయింది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీతో కలిసి వెళ్తామని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. అయితే పొత్తు విషయమై బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం పొత్తు లేదని తేల్చి చెప్పింది. గతంలో మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సీపీఐ, సీపీఎంలు మద్దతు ప్రకటించాయి. లెఫ్ట్ పార్టీల మద్దతుతో మునుగోడు అసెంబ్లీ స్థానం నుండి బీఆర్ఎస్ విజయం సాధించింది. లెఫ్ట్ పార్టీ మద్దతు లేకపోతే బీఆర్ఎస్ అభ్యర్థి విజయం అసాధ్యమని ఆనాడు ప్రత్యర్థి పార్టీలు అభిప్రాయపడ్డాయి.
ఆ తర్వాత కూడ బీఆర్ఎస్ పార్టీతో పొత్తు కొనసాగుతుందని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. వచ్చే ఎన్నికల్లో కనీసం నాలుగు నుండి ఐదు అసెంబ్లీ స్థానాలు ఇవ్వాలని సీపీఐ, సీపీఎంలు బీఆర్ఎస్ పార్టీని కోరాయి. రెండు పార్టీలకు ఒక్కొక్క అసెంబ్లీ సీటును ఇచ్చేందుకు మాత్రమే బీఆర్ఎస్ నాయకత్వం సుముఖంగా ఉంది. మూడు పార్టీల మధ్య పొత్తుల విషయమై ప్రతిష్టంభన నెలకొంది. సీట్ల విషయమై లెఫ్ట్ పార్టీల నుండి వచ్చిన ప్రతిపాదన నుండి బీఆర్ఎస్ నుండి సానుకూల స్పందన రాలేదు.
ఇవాళ కేసీఆర్ 115 అభ్యర్థులను ప్రకటించారు. లెఫ్ట్ పార్టీలతో పొత్తు లేదని కేసీఆర్ చెప్పకనే చెప్పారు. కేసీఆర్ నిర్ణయంపై లెఫ్ట్ పార్టీలు ఎలా స్పందిస్తాయో చూడాలి.
మునుగోడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడ లెఫ్ట్ పార్టీలను తమతో కలిసి రావాలని కాంగ్రెస్ కోరింది. రానున్న ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలు స్వంతంగా పోటీ చేస్తాయా లేదా ఇతర పార్టీలతో కలిసి పోటీ చేస్తాయా అనే విషయమై రానున్న రోజుల్లో తేలనుంది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలోనూ, తెలంగాణలో కూడా లెఫ్ట్ పార్టీలు పలు పార్టీలతో పొత్తులు పెట్టుకున్నాయి. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలతో లెఫ్ట్ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడ గత ఎన్నికల్లో మహాకూటమిగా పోటీ చేశాయి.

# అంగరంగ వైభవంగా గోదాదేవి సమేత మన్నార్ రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు

**జయభేరి, ఘట్ కేసర్ :**

నియోజకవర్గ పరిధిలోని ఘట్కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలో గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో గోదాదేవి సమేత మన్నార్ రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా దివ్య విమాన రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరై దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని, వేద పండితుల ఆశీర్వచనం అందుకుని, ఇటువంటి ఉత్సవాలను నిర్వహిస్తున్న గ్రామ పెద్దలను, గ్రామస్తులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హరి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఇటువంటి ఉత్సవాలు గ్రామాలలో ఐక్యతను చాటిచెప్పుతాయని, గ్రామస్తులందరూ కుల మతాలకు అతీతంగా ఇటువంటి ఉత్సవాలను నిర్వహించుకోవడం అనాదిగా వస్తుందని, భవిష్యత్తు తరాలు కూడా ఇలాగే ముందుకు సాగాలని, గ్రామాలన్నీ సస్యశ్యామలం కావాలంటే గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హరి వర్ధన్ రెడ్డి తో పాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్, ఘట్కేసర్ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రె జంగమ్మ, ఎదులాబాద్ గ్రామ ఎంపీటీసీ గట్టగళ్ళ రవీందర్, ఘన్ పూర్ సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్, శామీర్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, ఘట్కేసర్ మండల నాయకులు బింగి రాజేందర్ గౌడ్, బాషగోళ్ళ విజయ్, ఓబిసి సెల్ జిల్లా కన్వీనర్ బాలరాజు, గ్రామ అధ్యక్షులు అమర్, బింగి యుగేందర్ గౌడ్, ఉదయ్ కుమార్ రెడ్డి, బత్తిని కార్తీక్ గౌడ్, పూల మహేష్, రాజిరెడ్డి, ఘట్కేసర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేష్ నాయక్, పీర్జాదిగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు విజయ్, పార్టీ అధ్యక్షులు జూపల్లి రవీందర్, కీసర మండల కాంగ్రెస్ నాయకులు నల్ల మధుసూదన్ రెడ్డి, రామిడి విజయ్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాందాడి శివరాం రెడ్డి, తదితరు ఉన్నారు.





# అందరినీ కలుపుకుపోతా

## లక్ష మెజారిటీ గులాబీ జెండా ఎగరవేస్తా

**జయభేరి, కాప్రా :**

టికెట్ కేటాయించిన బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్ రావులకు కృతజ్ఞతలు. బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డి. ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోతామని, గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తా అని ఉప్పల్ నియోజకవర్గం భారాస అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నమ్మకం తో నాకు ఉప్పల్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు లకు కృతజ్ఞతలు తెలియజేసారు. సోమవారం సాయంత్రం సైనిక్ పూరి లోని పార్టీ కార్యాలయం లో బండారి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసిఆర్ ఆదేశాల మేరకు చేరి అంబర్ పేట, బాన్సువాడ , కామారెడ్డి,ఉప్పల్ అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఇంఛార్జి గా పని చేసి పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేశాను. అప్పటి నుండి ఇప్పటి వరకు ఏ బాధ్యత అప్పజెప్పిన పార్టీ కోసం పని చేశాను అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఉప్పల్ నియోజకవర్గంలో లక్ష మెజారిటీ గులాబీ జెండా ఎగరవేస్తా అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.










# ప్రభుత్వ అనుమతి లేని పాటశాల వల్ల విద్యార్థులకు తీరని నష్టం

**అనుమతి లేకుండా నడుస్తున్న భాష్యం స్కూల్ ను వెంటనే మూసివేయాలి**
**భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, బాపట్ల జిల్లా కమిటీ**



**జయభేరి, బాపట్ల :**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఎస్ ఎఫ్ ఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు ఆర్య మనోజ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లు వ్యతిరేకంగా ఉంది అని మాటలు చెప్తూ విద్యారంగ విషయంలో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ల కొమ్ము కాస్తుందని విమర్శించారు దానికి నిదర్శనం బాపట్లలో కొత్తగా ఏర్పాటు చేసిన భాష్యం హైస్కూల్ అని ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ గుర్తింపు లేకుండా భాష్యం హైస్కూల్ను నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తూ ఉండడం అనుమానాలకు దారితీస్తుందని వెంటనే భాష్యం విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు రాకుండానే బాపట్లలో కరపత్రాలు బ్యానర్లు వేసి ప్రచారం చేసి విద్యార్థులను విద్యార్థులు తల్లిదండ్రులను ఆకర్షించి మోసం చేస్తున్నారని గతంలో ఎస్ఎఫ్ఐ చేసిన విజ్ఞప్తులకి ఒకసారి పాఠశాలను మూసివేసిన సంగతి గుర్తు చేశారు. ఒకసారి మూసివేసిన పాఠశాలను ఎలాంటి అనుమతులు లేకుండా తిరిగి ఎలా ప్రారంభించారని ఎవరు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలను మూసివేయాలని విద్యార్థుల భవిష్యత్తుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలకు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్లు ప్రశ్నిస్తేనే నాయకులు మారుతారు

ప్రజలకు సంబంధించిన సమస్యలపై చట్టసభల్లో చర్చల ప్రమాణాలు పడిపోతున్నాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో ప్రజా ప్రతినిధుల ప్రవర్తనపై ఎన్నుకున్న ఓటర్లు ప్రశ్నించడం మొదలు పెట్టినప్పుడే ఇటువంటి ధోరణులను నియంత్రించవచ్చని అన్నారు. రాజస్థాన్‌లో ని జరుగుతోన్న తొమ్మిదవ కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ భారత ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న స్పీకర్.. చట్టసభల్లో పారదర్శకతకు డిజిటైజేషన్ ఎంతో కీలకమని చెప్పారు. తాము ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను ప్రశ్నించినప్పుడే సభల్లో నినాదాలు, అన్‌పార్లమెంటరీ ప్రవర్తనకు అడ్డుకట్ట వేయవచ్చని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. చట్టాలు చేసే క్రమంలో ముసాయిదా రూపకల్పన సమయంలో ప్రజల సూచనలకు చోటు కల్పించాలని సూచించారు. పార్టీల నిర్ణయాలకు అతీతంగా ప్రిసైడింగ్ ఆఫీసర్లు పనిచేయాలని.. నిష్పక్షపాత పద్ధతిలో సభను నడిపించాలన్నారు. ఈ సమావేశానికి సీపీఏ ఛైర్మన్ ఇయాన్ లిడెల్‌గ్రెయింగర్‌తోపాటు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషి, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, దేశవ్యాప్తంగా అసెంబ్లీల, మండళ్ల ప్రిసైడింగ్ ఆఫీసర్లు హాజరయ్యారు.

# మాట ఇచ్చా అభివృద్ధి చేసి చూపించా : బన్నాల

**జయభేరి, ఉప్పల్ :**



17 లక్షలతో చిలకనగర్ డివిజన్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నూతన సిసి రోడ్లు. చిలకనగర్ డివిజన్ రాఘవేంద్ర నగర్ కాలనీలో 14 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల మాట్లాడుతూ... చిల్కానగర్ డివిజన్లొ బస్తీలలో కాలనీలలో ప్రణాళిక బద్దం గా నూతన సీసీ రోడ్లు వేయిస్తున్నమని అన్నారు. జిహెచ్ఎంసి ఎలక్షన్లో ఇచ్చిన ప్రతి మాటని నిలబెట్టుకుంటూ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీలో నూతన సీసీ రోడ్లు వేయిస్తున్నందుకు రాఘవేంద్ర నగర్ కాలనీ ప్రజలు కార్పొరేటర్ గీత ప్రవీణ్ ని అభినందిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఈ నిఖిల్ రెడ్డి , ఏఈ రాజ్కుమార్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంజేపీటీబీసీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హసన్ పర్తి :**

మహాత్మా జ్యోతిబా పూలే హనుమకొండ, ములుగు డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంజేపీటీ బీసీ వర్ధన్నపేట సంక్షేమ గురుకుల కళాశాల (ఎల్లాపూర్) ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20232024 విద్యాసంవత్సరం నుండి తెలంగాణ ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ అధ్వర్యంలో హనుమకొండ, ములుగు డిగ్రీ కళాశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం హనుమకొండ బాలికల డిగ్రీ కళాశాలలో బీఏ ఎల్ఎల్ బీ ఎస్ వైడీసీ కోర్సులో ములుగు బాలికల డిగ్రీ కళాశాలలో బీఏ ఇపీహెచ్, బికాం సీఏ, బీఎస్సీ ఎంపీసీఎస్, బీజెడ్ సీ కోర్సులలో ప్రవేశాల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. పై కోర్సులలో ప్రవేశాల కోసం ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు గురుకుల భోజన వసతి సౌకర్యంతో పాటు నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతరములు ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 9154102621 నెంబర్ లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు.



# నేటి నుంచి ఓటరు జాబితా సవరణ.. మీ ఓటుందో లేదో చెక్ చేసుకోండి

**జయభేరి, మేడిపల్లి :**

కొత్త ఓటర్ల నమోదుకు, తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చడానికి, మార్పులు, చేర్పులకు సెప్టెంబర్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్లందరికీ మరోసారి తమ ఓటు హక్కును చెక్ చేసుకునే అవకాశం ఇస్తోంది. ఓటర్ల జాబితాలో పేరు లేని వారితో పాటు, ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండుతున్న వాళ్లంతా ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. అంతే కాకుండా ఓటర్లు తమ చిరునామా మార్చుకునే అవకాశం కూడా ఉన్నది. ఈ మేరకు ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నగర ప్రజల సౌకర్యార్థం ఓటరు జాబితా ప్రతులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగింది. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిశీలనను సెప్టెంబర్ 28 కల్లా పూర్తిచేసి.. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రకటిస్తామని ఎన్నికల సంఘం పేర్కొన్నది. అక్టోబర్ 4న ప్రకటించే తుది జాబితా ప్రకారమే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఈ సారి నమోదు చేసుకునే వారికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉన్నది. కాబట్టి ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకట సాయి నగర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన "అన్నపూర్ణ కిచెన్"ను పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చి రెడ్డి, కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి కలిసి ప్రారంబించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘువర్ధన్ రెడ్డి, శంకర్ రెడ్డి, నాగరాజు రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లం వెంకటేష్, వెంకటేష్, ఫణిందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.** **జయభేరి, మేడిపల్లి**

# ఉప్పల్ టికెట్ కోసం పరమేశ్వర్ రెడ్డి దరఖాస్తు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఏ బ్లాక్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం పరమేశ్వర్ రెడ్డి గారు గాంధీ భవన్ లో తన దరఖాస్తును అందచేయడం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం నుంచి పార్టీ తరపున పోటీ చేసేందుకు తనకు అన్ని రకాలుగా అర్హత ఉందని, తన కు అవకాశం కల్పించాలని కోరారు.



# రెండు స్థానాల్లో సీఎం కేసీఆర్ పోటీ, కారణం అదేనా?



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీలో అభ్యర్థుల ఎంపిక దృష్టిపెట్టాయి. ఇతర పార్టీల కంటే ఒక అడుగు ముందున్న అధికార బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ కీలకంగా వ్యవహరించారు. ఏడుగురు మినహా మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు కేటాయించారు. ఈసారి సీఎం కేసీఆర్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గజ్వేల్, కామారెడ్డి రెండుస్థానాల నుంచి తాను పోటీ చేయనున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. రాజకీయ వ్యూహంలో భాగంగా కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ గజ్వేల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గజ్వేల్ లో కేసీఆర్ పై పోటీ చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఇప్పటికే ప్రకటించారు. రాజకీయ ప్రత్యర్థులను సందిగ్ధంలోకి నెట్టేలా కేసీఆర్ రెండు స్థానాల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. అదే విధంగా ఉత్తర తెలంగాణలో పార్టీ బలోపేతానికి కామారెడ్డి నుంచి పోటీ చేసేందుకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్యే కవితకు తొలి జాబితాలో స్థానం దక్కలేదు. కవితను లోక్ సభకు పంపిస్తారా? లేక ఆఖరి నిమిషంలో సీటు కేటాయిస్తారో తెలియాల్సి ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

## మరచిపోలేని మధుర ఘట్టం

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లో ప్రతీ ఏటా 'ఇండియా డే పరేడ్' వేడుకలు నిర్వహిస్తారనే విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ వేడుకల్లో వివిధ రంగాలకు చెందిన భారతీయ ప్రముఖులు పాల్గొన్నారు. సినీ రంగం నుంచి అగ్ర కథానాయిక సమంత, జాక్వెలిన్ ఫెర్నాండేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియా డే పరేడ్ తాలూకు తన అనుభవాలను సమంత ట్విట్టర్ ద్వారా పంచుకుంది. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యం ఏమిటో ఈ పరేడ్ మరోసారి గుర్తుచేసిందని సమంత వ్యాఖ్యానించింది. 'నా జీవితంలో మరచిపోలేని మధుర ఘట్టమిది. ఈ దృశ్యాలు నా మదిలో ఎప్పటికీ నిలిచిపోయి ఉంటాయి. ఈ అరుదైన గౌరవం నాకు దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది' అని సమంత పేర్కొంది. గత సంవత్సరం జరిగిన పరేడ్‌లో అల్లు అర్జున్, అభిషేక్ బచ్చన్, రానా, రవీనా టాండన్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.







## రష్మికతో చేసిన సీన్స్ వేస్ట్.. శ్రీలీలకు ఛాన్స్!

వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, రష్మిక మందన్న కొత్త సినిమా కోసం కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే ఇప్పుడు సినిమా టీమ్ నుండి రష్మిక మందన్న బయటకు రావడంతో ఆ సీన్స్ అన్నీ వృథా అయ్యాయి. శ్రీలీలతో ఆ సీన్స్ మళ్లీ రీషూట్ చేయాల్సి ఉంది. ఓ వైపు రష్మిక మందన్న చాలా సినిమాల్లో బిజీగా ఉంది. ఆమెను వెతుక్కుంటూ కొత్త అవకాశాలు వస్తున్నాయి. సౌత్ ఇండియాలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమెకు విపరీతమైన డిమాండ్ ఉంది. గతంలోనే నితిన్ సినిమా నుంచి రష్మిక తప్పుకుంటుందని ప్రచారం జరిగింది. తాజాగా ఈ విషయం ఖరారైంది. నితిన్ కొత్త సినిమాలో రష్మిక మందన్న నటిస్తోంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇప్పుడు నటీనటుల్లో మార్పు వచ్చింది. రష్మిక మందన్న స్థానంలో నటి శ్రీలీల హీరోయిన్‌గా ఎంపికైంది. సినిమా టీమ్ నుంచి రష్మిక తప్పుకుంది. నితిన్, వెంకీ కుడుముల, రష్మిక మందన్న గతంలో 'భీష్మ' సినిమాలో కలిసి పనిచేశారు. ఆ సినిమా హిట్ అయింది. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో కొత్త సినిమా రూపొందుతోందని చెప్పగానే అభిమానుల్లో సహజంగానే ఆసక్తి నెలకొంది. ఈ సినిమా టైటిల్ ఇంకా ఖరారు కాలేదు. వెంకీ, నితిన్, రష్మిక సినిమా కాబట్టి #VNR అని పిలిచారు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో రష్మిక మందన్న నటించడం లేదని తెలుస్తోంది. రష్మిక మందన్న చాలా సినిమాల్లో నటిస్తోంది. ఎంతగానో ఎదురుచూస్తున్న పుష్ప 2 సినిమా కోసం చాలా రోజుల నుంచి కాల్షీట్స్ ఇచ్చింది. యానిమల్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ కారణాలన్నింటి వల్ల ఆమెకు డేట్స్ సమస్య ఏర్పడింది. అందుకే #VNR ప్రాజెక్ట్ నుండి రష్మిక తప్పుకుందని అంటున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మిక మందన్న స్థానంలో శ్రీలీల ఎంపికైంది. ప్రస్తుతం టాలీవుడ్ లో శ్రీలీలకు బాగా డిమాండ్ ఉంది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కోసం నితిన్, రష్మిక మందన్నపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇప్పుడు రష్మిక మందన్న సినిమా టీమ్ నుండి తప్పుకోవడంతో ఆ సీన్స్ వృథా అయ్యాయి. శ్రీలీల తో ఆ సన్నివేశాలన్నీ రీషూట్ చేయాల్సి ఉంది. శ్రీలీల ఇప్పటికే షూటింగ్ సెట్‌కి చేరుకుందని, హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైందని మీడియాలో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో పాటు భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి సినిమాల్లోనూ నటిస్తోంది శ్రీలీల.

## ప్రయోగాలకు సిద్ధం

'ప్రేమకథా చిత్రాలతో పాటు థ్రిల్లర్ మూవీస్‌లో నటించాలనుంది. ప్రతీ సినిమాలో నటనాపరంగా వైవిధ్యాన్ని ప్రదర్శించాలన్నదే నా లక్ష్యం' అని చెప్పింది సాక్షి వైద్య. 'ఏజెంట్' చిత్రం ద్వారా తెలుగులో అరంగేట్రం చేసిన ఈ భామ ప్రస్తుతం చక్కటి అవకాశాలతో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఆమె 'గాండీవధారి అర్జున' చిత్రంలో వరుణ్‌తేజ్ సరసన నటిస్తున్నది. ఈ చిత్రం ఆగస్ట్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం సాక్షి వైద్య పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో నేను ఐరా అనే స్వంతంత్ర్య భావాలు కలిగిన అమ్మాయిగా కనిపిస్తాను. కథాగమనంలో నా పాత్ర కీలకంగా ఉంటుంది. లండన్‌లో చిత్రీకరించిన ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయి. ఎక్కడా గ్యాప్ లేకుండా శరవేగంగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయడంతో కొద్ది రోజుల పాటు నా పాత్ర ప్రభావం నుంచి బయటకు రాలేకపోయా. వ్యక్తిగతంగా నేను అన్ని జోనర్ చిత్రాలను ఇష్టపడతా. 'యశోద' చిత్రంలో సమంత లాంటి పాత్ర చేయాలన్నది నా డ్రీమ్. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఇష్టపడుతున్నారు. నటిగా ప్రయోగాలకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటా. తెలుగు భాషను నేర్చుకొని అభిమానులకు ప్రేమను తిరిగి ఇస్తాను. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటిస్తున్నా. సాయిధరమ్‌తేజ్‌తో ఓ సినిమా అంగీకరించా. రవితేజతో ఓ సినిమా చర్చల్లో ఉంది' అని చెప్పింది.





## రూ.1230 కోట్లు.. అదిరిపోయిన బాక్సాఫీస్

నాలుగు సినిమాలు.. రూ.1230 కోట్లు రాబట్టాయి. ఈ ఏడాది ఇండిపెండెన్స్ డే వీక్ అదిరిపోయింది. బాలీవుడ్, కోలీవుడ్ మూవీస్ కలెక్షన్ల వర్షం కురిపించాయి. ఈ ఏడాది ఇండియన్ ఇండిపెండెన్స్ వీక్ బాక్సాఫీస్ కు బాగా కలిసొచ్చింది. ఆగస్ట్ 11 నుంచి ఆగస్ట్ 21 మధ్య రిలీజైన సినిమాలు మంచి కలెక్షన్లు రాబట్టాయి. బాలీవుడ్, కోలీవుడ్ సినిమాలు వసూళ్ల వర్షం కురిపించాయి. ఈ పది రోజుల్లో నాలుగు సినిమాలు ఏకంగా రూ.1230 కోట్లు వసూలు చేయడం విశేషం. ఈ సినిమాల్లో తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన జైలర్ మూవీ టాప్ లో నిలిచింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ రూ.543.96 కోట్లు రాబట్టింది. తొలి రోజు నుంచే హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ సినిమా.. బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ దూసుకెళ్లింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ సినిమాగా రికార్డు క్రియేట్ చేసింది. 22 ఏళ్ల కిందట రిలీజై సంచలనం రేపిన గదర్ మూవీకి సీక్వెల్‌గా ఇండిపెండెన్స్ డే ముందు రిలీజైన గదర్ 2 కూడా బాక్సాఫీస్ రికార్డులన్నింటినీ చెరిపేసింది. రెండో వీకెండ్ లో ఏకంగా పఠాన్, బాహుబలిలాంటి సినిమాల రికార్డులనూ బ్రేక్ చేయడం విశేషం. ఈ సినిమా తొలి రోజే మిశ్రమ స్పందన వచ్చినా.. ఫ్యాన్స్ ఎగబడి చూశారు. గదర్ 2 సెకండ్ వీకెండ్ ముగిసే సమయానికి రూ.478.02 కోట్లు వసూలు చేసింది. 11 ఏళ్ల కిందట వచ్చిన ఓఎంజీ సినిమాకు సీక్వెల్ గా వచ్చిన ఓఎంజీ 2 మూవీ కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. అక్షయ్ కుమార్, పంకజ్ త్రిపాఠీ కలిసి నటించిన ఈ సినిమా.. సెక్స్ ఎడ్యుకేషన్ పై సందేశం ఇస్తూ సాగింది. మరీ జైలర్, గదర్ 2 రేంజ్ లో కాకపోయినా.. డీసెంట్ కలెక్షన్లు సాధించిందీ మూవీ. ఇప్పటి వరకూ రూ.162.3 కోట్లు వసూలు చేసింది. ఈ నాలుగు సినిమాల్లో దారుణంగా విఫలమైన మూవీ మెగాస్టార్ చిరంజీవి నటించిన భోళా శంకరే. ఎన్నో అంచనాల మధ్య రిలీజైనా కూడా బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడింది. ఈ మూవీ కేవలం రూ.45.65 కోట్లు మాత్రమే వసూలు చేసి.. నిర్మాతలకు భారీ నష్టాలను మిగిల్చింది. అయితే గత 11 రోజుల్లో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ కలిపి ఏకంగా రూ.1230 కోట్లు వసూలు చేయడమే బాక్సాఫీస్ సక్సెస్ కు నిదర్శనంగా చెప్పొచ్చు. ఒక్క భోళా శంకర్ తప్ప మిగతా సినిమాలు ఇండిపెండెన్స్ డే వీక్ ను బాగానే ఉపయోగించుకున్నాయి.

## పెళ్లి వద్దు కానీ.. ప్రెగ్నెన్సీ కావాలంటున్న అనుష్క..



పెళ్లి వద్దు కానీ.. ప్రెగ్నెన్సీ కావాలంటోంది అనుష్క. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ట్రైలర్ చాలా బోల్డ్ గా అదే సమయంలో నవీన్ గత సినిమాల్లోలాగే ఫన్నీగా సాగిపోయింది. నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి లీడ్ రోల్స్ లో నటిస్తున్న మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీ ట్రైలర్ సోమవారం రిలీజైంది. ఊహించినట్లే ఈ ట్రైలర్ అంతా సరదాగా సాగిపోయింది. అయితే ఇందులోనూ ఊహించని ట్విస్టులు, అనుష్క బోల్డ్ డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో స్టాండప్ కమెడియన్‌గా నవీన్ కనిపించాడు. ఇక అటు అనుష్క మాత్రం ప్రేమ, పెళ్లి మీద నమ్మకం లేదంటూ తల్లి కావడానికి ఆరాటపడే ఓ చెఫ్ పాత్రలో కనిపించింది. చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై కనిపిస్తున్న అనుష్క.. ఇలాంటి బోల్డ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం నిజంగా ఆశ్చర్యకరమే. మహేష్ బాబు పీ డైరెక్ట్ చేసిన ఈ మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీ సెప్టెంబర్ 7న రిలీజ్ కాబోతోంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. స్టాండప్ కమెడియన్, చెఫ్ మధ్య సాగే ఓ వెరైటీ లవ్ స్టోరీగా కనిపిస్తోంది. తల్లి కావడానికి ప్రెగ్నెన్సీ వస్తే చాలు కానీ.. పెళ్లితో పనేముందంటూ అనుష్క ఓ బోల్డ్ డైలాగ్ చెబుతుంది. అటు నవీన్ మాత్రం ఓ స్వచ్ఛమైన ప్రేమ, పెళ్లి కోసం ప్రయత్నిస్తుంటాడు. అనుష్క రూపంలో ఓ మంచి అమ్మాయి దొరికిందని సంతోషించినా.. ప్రేమ, పెళ్లి వద్దనుకుంటూ కేవలం తల్లి కావాలనుకునే ఆమె కోరిక విని షాక్ తింటాడు. అయినా అనుష్క బిడ్డకు తండ్రి కావడానికి సిద్ధపడతాడు. ఆ తర్వాత వచ్చే సీన్లు కాస్త సరదాగా సాగుతాయి. కొన్ని డబుల్ మీనింగ్ డైలాగులు కూడా ఈ ట్రైలర్ లో ఉన్నాయి. అయితే మెల్లగా ట్రైలర్ ఫన్ రైడ్ నుంచి సీరియస్ టర్న్ తీసుకుంటుంది. నువ్వు స్టాండప్ కమెడియన్ వి కాదు జోకర్ వంటూ నవీన్ పై అనుష్క మండిపడటం కూడా ఈ ట్రైలర్ లో చూడొచ్చు. మొత్తానికి ఈ కాలం యువతకు తగిన ఓ వెరైటీ సబ్జెక్ట్ తో ఈ మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమా వస్తున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. ప్రభాస్ లాంటి హీరోకి కూడా ఈ ట్రైలర్ తెగ నచ్చేసింది. నవీన్ కామెడీ టైమింగ్, చాలా రోజుల తర్వాత స్క్రీన్ పై కనిపించనున్న అనుష్క అందం.. ఈ సినిమాకు ప్లస్ కానుంది. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాలో నవీన్, అనుష్కతోపాటు మురళీ శర్మ, తులసి, జయసుధ, భద్రం, నాజర్, అభినవ్ గోమటంలాంటి వాళ్లు నటించారు. యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను తెరకెక్కించింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com